ముమ్మరంగా ఉపాధి హామీ పనులు


మునుగోడు : వెల్మకన్నె పెద్ద చెరువులో పూడిక తీస్తున్న కూలీలు


కేతేపల్లి : చెరువు పూడికతీత పనుల్లో పాల్గొన్న ఉపాధి హామీ కూలీలు

- చెరువుల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యం
- ఒండ్రు మట్టి పొలాలకు తరలింపు
- భూసారంతోపాటు చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగే అవకాశం

మునుగోడు: గ్రామాల్లో వలసలను నివారించి ప్రతిఒక్కరికీ పని కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు మునుగోడు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ వేసవిలో చెరువుల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో సారవంతం లేని వ్యవసాయ భూముల్లోకి చెరువులోని ఒండ్రు మట్టిని తరలించేందుకు రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒండ్రు మట్టిని తరలించడం వల్ల ఇటు రైతుల పంట పొలాలు అధిక దిగుబడి రావడంతో పాటు చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.

మునుగోడు మండల వ్యాప్తంగా..

మునుగోడు మండల వ్యాప్తంగా ఉన్న 27 గ్రామాల్లో మొత్తం 11,550 జాబ్‌కార్డులు ఉండగా 24,291 మందికి ఉపాధి పనులు చేసుకునే అవకాశం ఉంది. అందులో ప్రతి ఏటా 6597 మంది ఉపాధి హామీ పనులకు వస్తున్నారు. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండడంతో ప్రస్తుతం రోజుకు 2500 నుంచి 2700 మంది కూలీలు పనులకు వస్తున్నారు. అందులో 17 గ్రామాల్లో చెరువుల్లో పూడిక తీత పనులను జనవరి మాసం నుంచి కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా లక్షా 23వేల 200 క్యూబిక్ మీటర్ల మట్టిని 49280 ట్రాక్టరు ట్రిప్పుల ద్వారా 1642 మంది రైతుల వ్యవసాయ భూముల్లోకి తరలించారు. ఎకరానికి 10 నుంచి 20 ట్రాక్టర్ల చొప్పున దాదాపు 3285 ఎకరాలకు ఒండ్రు మట్టిని తోలారు.

ఒండ్రు మట్టి వల్ల కలిగే ప్రయోజనాలు..

- భూముల్లో సారవంతం పెరుగుతుంది
- భూమిలో తేమ శాతం అధికంగా ఉంటుంది
- నాటిన విత్తనాలు వెంటనే మొలకెత్తి చేను తొందరగా పెరుగుతుంది
- పంట దిగుబడి అధికంగా వస్తుంది
- చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది

కేతేపల్లిలో ప్రతిరోజూ 3500 మంది కూలీలు

కేతేపల్లి: మండలంలో 16 గ్రామాలు మరో ఐదు ఆవాస గ్రామాలు ఉండగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయి. మూసీ కుడి ప్రధాన కాల్వకు పై వైపున ఉన్న కేతేపల్లి, గుడివాడ, ఇప్పలగూడెం, కొర్లపహాడ్, ఇనుపాముల, బండపాలెం, కొండకిందిగూడెం, కొప్పోలు, భీమారం, చెర్కుపల్లి గ్రామాల్లోని చెరువులు చుక్క నీరు లేకుండా ఎండిపోయాయి. దీంతో ఆయా గ్రామాల్లో అత్యధిక శాతం చెరువు పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతిరోజు మండల వ్యాప్తంగా 3500 మంది కూలీలు హాజరవుతుండడం విశేషం. ఎంతో సారవంతమైన చెరువు ఒండ్రు మట్టి ఉపాధి పనులతో ఉచితంగా లభిస్తుండడంతో పాటు పంటలకు కావాల్సిన అన్ని పోషకాలు ఉండడంతో రైతులు తమ పంట పొలాలకు తరలించుకుంటున్నారు.

నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో..

కేతేపల్లి మండలంలోని మూసీ నాన్ ఆయకట్టు గ్రామాల్లో చెరువు పూడికతీత పనులకు అధిక సంఖ్యలో కూలీలు హాజరవుతున్నారు. ఈ గ్రామాల్లో ప్రతిరోజు 350 నుంచి 400 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. మార్చి చివరి వరకు కూలీల వేతనాలు వారి బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు అధికారులు తెలిపారు. పనిని బట్టి కూలీలకు సగటు వేతనం రూ.200 నుండి రూ.220 వరకు లభిస్తోంది.

దిగుబడి బాగా వస్తుంది



సారవంతం లేని భూమిలో ఒండ్రు మట్టిని పోస్తే భూసారం పెరగడంతోపాటు పంటల దిగుబడి అధికంగా వస్తుంది. గత ఏడాది నేను రెండు ఎకరాల భూమిలో ఒండ్రు మట్టిని పోయిస్తే గతంలో కంటే ఎక్కువ దిగుబడి వచ్చింది. దీంతో ఈ ఏడాది కూడా మరో 2 ఎకరాల్లో ఒండ్రు మట్టి పోయించా. ప్రతి ఏడాది ఒండ్రు మట్టిని భూముల్లో పోయిస్తే చాలా మంది రైతులకు మేలు జరుగుతుంది. –యంపల్ల రామస్వామి, రైతు చొల్లేడు, మునుగోడు

రైతులంతా ఒండ్రు మట్టిని అడుగుతున్నారు



మండలంలోని రైతులంతా ఒండ్రు మట్టి కావాలని అడుగుతున్నారు. దీంతో చెరువుల్లో పూడిక తీత పనులతోపాటు రైతుల భూములకు మేలు కలుగుతుందని అధిక గ్రామాల్లో ఆ పనులనే చేయిస్తున్నాం. మొత్తం 27 గ్రామాల్లో 9 గ్రామాల్లో మాత్రమే చేపల చెరువుల నిర్మాణం, ఫీడర్ చానల్ అభివృద్ధి, ఇతర పనులు జరుగుతున్నాయి. మిగిలిన 17 గ్రామాల్లో ఒండ్రు మట్టి తరలింపు పనులు కొనసాగిస్తున్నాం. –శ్రీనయ్య, ఏపీఓ మునుగోడు

నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది



ప్రస్తుతం చాలా గ్రామాల్లోని చెరువుల్లో నీరు లేకపోవడంతో పూడిక తీత పనులకు ప్రాధాన్యత ఇచ్చాం. పూడికతీత ద్వారా చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. చెరువు మట్టిని రైతులు తమ పంట పొలాల్లో పోసుకుంటే పంట దిగుబడి అధికంగా వస్తుంది. –సురేందర్, ఏపీఓ, కేతేపల్లి

క్లుప్తంగా

హాకీ శిక్షణ శిబిరం ప్రారంభం


శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

చిట్యాల: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత హాకీ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం హాకీ సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు కొండ పరమేష్, గంగాపురం రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని మే 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎలుగు చంద్రశేఖర్, ఉయ్యాల లింగస్వామి, నవీన్, చిన్నారులు పాల్గొన్నారు.

సోమరాజు చెరువును పరిశీలించిన అధికారులు


చెరువును పరిశీలిస్తున్న డీఈఈ కాత్యాయని

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని మర్రిగూడ సోమరాజు చెరువులో జరిగిన అక్రమ తవ్వకాలపై తనిఖీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఇరిగేషన్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కాత్యాయని, ఏఈఈ శివరామ్‌ప్రసాద్ చెరువును పరిశీలించారు. చెరువులో 8 ఫీట్ల లోతులో గుంతలు తవ్వి 4 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించినట్లుగా అంచనా వేశారు. మట్టిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా తిప్పర్తి మండల తహసీల్దార్, ఎస్ఐ, మైనింగ్ శాఖకు నివేదిక అందించారు.

విద్యార్థినికి సత్కారం


స్వాతిని సన్మానిస్తున్న కౌన్సిలర్ సుకన్య

నకిరేకల్ : ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన నకిరేకల్ పట్టణంలోని 4వ వార్డు పటేల్‌నగర్‌కు చెందిన రాచకొండ స్వాతిని శుక్రవారం ఆ వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్ సన్మానించారు. కార్యక్రమంలో బండపల్లి శ్రీనివాస్‌గౌడ్, గుండగోని వెంకన్న, పిల్లలమర్రి సతీష్, కైరంకొండ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కేతేపల్లి: మండలంలోని భీమారం గ్రామానికి చెందిన ఎర్రబోయిన వీరమ్మ, మాదాసు పాపయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈమేరకు మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ శుక్రవారం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిమట వెంకన్న ఉన్నారు.

కనకదుర్గ ఆలయంలో తీన్మార్ మల్లన్న పూజలు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

చిట్యాల: నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న శుక్రవారం చిట్యాలలోని శ్రీకనకదుర్గ ఆలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా నల్లగొండలో నామినేషన్ కార్యక్రమానికి తరలి వెళ్లారు.

నేడు యువ సమ్మేళనం

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం యువ సమ్మేళనం నిర్వహించనున్నట్లు బీజేపీ మున్సిపల్ కమిటీ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామంలోని శుభం గార్డెన్స్‌లో నిర్వహించనున్న యువ సమ్మేళనానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌లు హాజరవుతారని తెలిపారు. సమ్మేళనానికి యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ శ్రీనివాస్

నల్లగొండ అగ్రికల్చర్ : నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో గల ఎరువుల దుకాణాన్ని శుక్రవారం మండల వ్యవసాయాధికారి సుంకోజు శ్రీనివాస్ తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎరువులు అమ్మిన వెంటనే యాప్‌లో రైతుల పేరు, కొన్న సరుకు వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్నామని తెలిపారు.

ఇంటివద్దనే ఓటింగ్ కార్యక్రమం పూర్తి

శాలిగౌరారం: అంగవైకల్యం కలిగి నడవలేని స్థితిలో ఉన్నవారు, 85 సంవత్సరాల వయస్సు పైబడిన వారు ఇంటివద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం 'ఇంటివద్దనే ఓటింగ్, 85 ప్లస్ అండ్ పీడబ్ల్యూడీ' అనే పేరుతో అవకాశం కల్పించింది. దీంతో ఎన్నికల అధికారి రమేశ్ నేతృత్వంలో ఎన్నికల సిబ్బంది శుక్రవారం మండలంలో నమోదైన ఓట్లను స్వీకరించారు. మండలంలో 17 మంది ఇంటి వద్దనే ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా అందులో 16 మంది ఓటర్ల నుంచి ఓట్లను స్వీకరించారు. మరొక దరఖాస్తుదారు మృతిచెందారు.

కోరం లేక రెండోసారి సర్వసభ్య సమావేశం వాయిదా


మాట్లాడుతున్న ఎంపీడీఓ చినమునయ్య

మర్రిగూడ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేని కారణంగా వాయిదా పడింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.చినమునయ్య మాట్లాడుతూ సమావేశానికి సరిపడా కోరం సభ్యులు హాజరుకాని కారణంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం కూడా సమావేశం వాయిదా పడిన విషయం తెలిసిందే. సూపరింటెండెంట్ యాకుబ్, ఎంపీఓ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, బీట్ ఆఫీసర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాలి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పిల్లి రామరాజు

నల్లగొండ టూటౌన్: నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేసేందుకు నల్లగొండ ఎంపీగా శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కో కన్వీనర్ పిల్లి రామరాజుయాదవ్ కోరారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని పెద్దబండ, అంబేద్కర్‌నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, ఓంసాయికాలనీ, గొల్లగూడ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పాలనను అరికట్టేందుకు ప్రజలందరూ ఎదురుచూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బత్తుల నరేష్, ఉప్పు రామకృష్ణ, అజయ్, అయ్యప్ప, సత్తయ్య, ఝాన్సీ, మల్లేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే మునుగోడు అభివృద్ధి

మునుగోడు: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే మునుగోడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవిముదిరాజ్ అన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని కల్వలపల్లి, పులిపలుపుల, జమస్థాన్‌పల్లి, గుండ్లోరిగూడెం తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామశాఖ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మండల ఇన్‌చార్జ్ కొలను రాజేందర్‌రెడ్డి, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, పోలగోని సత్యం, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, బూడిద లింగయ్యయాదవ్, భీమనపల్లి సైదులు, జాజుల అంజయ్యగౌడ్, జాల వెంకన్నయాదవ్, పాల్వాయి చెన్నారెడ్డి, దోటి నారాయణ, చెరుపల్లి వెంకన్న, పాలకూరి యాదయ్యగౌడ్, నకిరెకంటి యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

చండూరు (గట్టుపల్): భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గట్టుప్పల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామల యాదయ్య, నామని బుచ్చయ్య, చెరుపెల్లి సత్యనారాయణ, మోదుగు నాగిరెడ్డి, చెరుపల్లి ఆంజనేయులు, బాల్‌రెడ్డి, మహమ్మద్ అబ్బాస్, యాదయ్య, నయీం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి సాధ్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : పేద ప్రజల ఆర్థిక అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ నకిరేకల్ పట్టణంలోని 1వ వార్డుల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు మాసాల్లోనే ఆరు గ్యారంటీ స్కీంలు అమలు చేసిందన్నారు. 1వ వార్డు కౌన్సిలర్ కందాల భిక్షంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య, శ్రీనివాస్, యానాల లింగారెడ్డి, శ్యానాల యుగేందర్‌రెడ్డి, ముద్దం విజయ్, అశోక్‌రెడ్డి, భద్రారెడ్డి, మహేందర్‌రెడ్డి, బండపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


నకిరేకల్ : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ మండలంలోని మంగళపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బచ్చుపల్లి గంగాధర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో కొప్పుల వెంకన్నగౌడ్, సందినేని కిషన్‌రావు, రాచమళ్ల సోమయ్య, పైళ్ల జానయ్య, పూల సతీష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నకిరేకంటి ఏసుపాదం, బచ్చుపల్లి మునీందర్‌రావు, భుజంగరావు, బొల్లేద్దు లక్ష్మయ్య, చింతల శ్రీను, కందికంటి సతీష్ తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ

- సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మునుగోడు: దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రధాని మోదీని పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి గద్దె దింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు ఓటువేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం పనిచేసే పార్టీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, చాపల మారయ్య, వరికుప్పల ముత్యాలు, నారబోయిన నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జహంగీర్‌ను గెలిపించాలి

కట్టంగూర్ : ప్రజా సమస్యలపై పోరాడే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కట్టంగూర్‌లో సీపీఎం నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. శనివారం ఈదులూరు నుంచి చెరువుఅన్నారం వరకు నిర్వహించే రోడ్ షోను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చెర్వుఅన్నారంలో జరిగే బహిరంగ సభకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణజ్యోతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, గంజి మురళీధర్, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, కట్ట బక్కయ్య, చిలుముల రామస్వామి, మురారి మోహన్, జాల రమేష్, సుజాత, శ్రీను పాల్గొన్నారు.


కట్టంగూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఉరుమడ్లలో సీపీఎం ప్రచారం

చిట్యాల: సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్‌కు మద్దతుగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణజ్యోతి, జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూలీలతోపాటు గ్రామస్తులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహ, బెలిజ మల్లయ్య, కురుపి లింగయ్య, జనపాల సుగుణమ్మ, లక్ష్మమ్మ, సత్తయ్య, యాదయ్య, కమలమ్మ, రామస్వామి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మల్లేష్‌కు ఓటు వేయాలి


శాలిగౌరారం : శాలిలింగోటంలో కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

నకిరేకల్: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్ మున్సిపాలిటీలోని 12, 13 వార్డుల్లో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాచకొండ వెంకన్నగౌడ్, నడికుడి వెంకటేశ్వర్లు, అమీర్‌పాషా, యానాల లింగారెడ్డి, దైద పరమేషం, రాజా, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాలిగౌరారం: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్‌కు ఓటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాలిలింగోటం, అంభారిపేట, తక్కెళ్ళపహాడ్, భైరవునిబండ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, ప్రధాన కార్యదర్శి చాడ హతీష్‌రెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, దుబ్బ వెంకన్న, పాక యాదయ్య, మామిడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ శిబిరం

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా యువజన క్రీడాల కార్యాలయం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత తైక్వాండ్, వాలీబాల్, యోగ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చిలువేరు సైదులు, ఉప్పల రవికుమార్, సూరపల్లి ప్రతాప్, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అతి త్వరలో కనుమరుగు కావడం ఖాయమని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీకటిమామిడి, పలివెల, రావిగూడెం గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం మునుగోడులో రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లపాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ పార్టీ చేసిన నియంత పాలనే నేడు ఆ పార్టీ పతనానికి కారణమవుతోందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్ కుటుంబం చిప్పకూడు తినక తప్పదన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఆ కుటుంబ సభ్యులను కవితలాగానే తీహార్ జైలుకు పంపిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు తమని కాంగ్రెస్‌లో చేర్చుకోవాలని వేడుకుంటున్నారని అన్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 14 స్థానాల్లో భారీ మెజార్టీతో గెలుపొందుతుందని, భువనగిరిలో దాదాపు 5 లక్షల మెజార్టీ వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నారబోయిన రవిముదిరాజ్, వేమిరెడ్డి జితేందర్ రెడ్డి, పోలగోని సత్యంగౌడ్, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, జాల వెంకన్న యాదవ్, భీమనపల్లి సైదులు, పాల్వాయి జితేందర్‌రెడ్డి, చెన్నారెడ్డి, మేకల ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మునుగోడు : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిక

చండూరు : మున్సిపల్ కేంద్రానికి చెందిన వార్డు కౌన్సిలర్ మంచికొండ కీర్తిసంజయ్‌తోపాటు పలువురు యువకులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం మునుగోడులో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో దోటి వెంకటేశ్‌యాదవ్, అనంత చంద్రశేఖర్‌గౌడ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

నల్లగొండరూరల్: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య కోరారు. శుక్రవారం నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల, దోమలపల్లి, అప్పాజీపేట గ్రామాల్లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జకీరా తాజుద్దీన్, సతీష్‌రెడ్డి, బ్రహ్మచారి, సైదులు యాదవ్, లింగస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం


చిట్యాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ చిట్యాల పట్టణంలోని 98వ బూత్‌లో బీజేపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బానుక ఉదయ్, మాస శ్రీనివాస్, గుండాల నరేష్‌గౌడ్, ఉయ్యాల ప్రశాంత్‌గౌడ్, పబ్బు శేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం

నకిరేకల్ : కేంద్రంలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు వీరయ్య అన్నారు. నకిరేకల్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మండల వెంకన్న, గుడుగుంట్ల సాయన్న, బుడిగు సైదులు, చనగాని రాములు, కొండేటి శ్రీను, బండమీది శ్రీకాంత్, చినేని జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి ఇంటింటా ప్రచారం

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ నకిరేకల్‌లోని 1వ వార్డు పరిధి మార్కెట్ రోడ్డులో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ మహిళా శక్తి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా శక్తి ప్రతినిధులు బద్దె సత్యవతి, పందాల వసంత పాల్గొన్నారు.

విధులు నిర్వహిస్తూ.. మనవరాలిని లాలిస్తూ..



ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ అదే సమయంలో మనవరాలిని లాలిస్తోంది నల్లగొండ మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయ అకౌంటెంట్ అంజలి. ఆమె కూతురు హైదరాబాద్‌లోనే ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తోంది. దీంతో చిన్నారి అమ్మమ్మ వద్ద ఉంటోంది. అంజలి తన మనవరాలిని కార్యాలయానికి తీసుకెళ్లి విధులు నిర్వహిస్తూ ఆలనా పాలనా చూసుకుంటోంది. – నల్లగొండ రూరల్